# గర్భవతులకి బ్లీడింగ్ కనిపిస్తే?

గర్భం అంటూ వస్తే ఇక అప్పటినుంచీ ప్రసవసమయం వరకూ బ్లీడింగ్ (రక్తస్రావం) కనబడదు. కనబడకూడదు!

చాలామందిలో గర్భం వచ్చేకకూడా అప్పుడప్పుడు కొంత బ్లీడింగ్ కనబడుతుంది. ఆ బ్లీడింగ్ గురించి ఆందోళన పడక్కర్లేని సందర్భాలు కొన్ని ఉంటాయి. వెంటనే డాక్టర్ని సంప్రదించాల్సిన సందర్భాలు కొన్ని ఉంటాయి. ప్రతి గర్భవతీ వాటి గురించి తెలుసుకొని ఉండటం మంచిది.

## ప్రమాదంలేని సందర్భాలు

- కొంత మంది స్త్రీలకి గర్భం వచ్చేక కూడా 1-2 నెలలపాటు పీరియడ్స్ రావలసిన డేట్స్‌లో కొద్దిగా బ్లీడింగ్ లేదా ఎరుపు కనిపిస్తుంది. అయితే పూర్తిస్థాయి బహిష్టు మాత్రం అవదు. అది బహిష్టా, గర్భం వచ్చి ఉందా అనే అనుమానం తీరాలంటే ప్రెగ్నెన్సీ టెస్టు చేయించుకోవడమే.
- నిజానికి చాలామంది గర్భం వచ్చిన నెలలో డేట్ ప్రకారం ఎరుపు కనిపించడాన్ని బట్టి అదే పీరియడ్స్ అనుకుంటారు. ఆ మరుసటి నెల బ్లీడింగ్ కనపడకపోతే అప్పుడు నెలతప్పా మనుకుంటారు. దాంతో నెలలు తప్పుగా లెక్కవేసుకుంటారు. డాక్టరు 4 నెలల పిండం అని చెపితే 'అదేమిటి ఇంకా మూడవ నెలే కదా? అని అబ్బురపడతారు.
- 25% మంది స్త్రీలలో ఇలా గర్భం వచ్చిన తర్వాత కూడా ఆ నెలలో బ్లీడింగ్ కనిపిస్తుంది. దీన్ని "ఇంప్లాంటేషన్ బ్లీడింగ్" అంటారు. అంటే అప్పుడే ఏర్పడ్డ పిండం గర్భసంచిలోకి వేళ్ళు పాతుకునే సమయంలో కలిగే బ్లీడింగ్ అని అర్థం. అబ్బే, అసలు అలాందేమీ ఉండదని కొందరు శాస్త్రజ్ఞులు వాదిస్తారు.
- ఈ బ్లీడింగ్ మామూలు బహిష్టుకన్నా తక్కువగా వస్తుందని చెప్పుకున్నాం. కలర్ పింక్ కలర్‌లో కాని, గోధుమ రంగులోకాని ఉంటుంది. అండం విడుదలైన 5వ రోజు నుంచి 12వ రోజు మధ్యలో ఎప్పుడో కనిపిస్తుంది.
- ఈ రకం బ్లీడింగ్ ఆందోళనకర మైనది కాదు.



## ఇంకెప్పుడైనా బ్లీడింగ్ కనిపిస్తే?

పై రకం బ్లీడింగ్ తప్ప గర్భవతికి ఇంకెప్పుడు బ్లీడింగ్ కనబడినా హెచ్చరికగా ఉండాలి. స్వంత నిర్ణయాలు తీసుకోకుండా వెంటనే డాక్టర్ని సంప్రదించాలి.

◆ గర్భం మధ్యలో రక్తస్రావం జరగడం సాధారణంగా ఎబార్షన్‌కి సూచన.

◆ అయితే బ్లీడింగ్ కాని, ఎరుపు కాని కనిపించిన ప్రతిసారీ అది ఎబార్షన్‌కి దారితీయకపోవచ్చు; కాని అవకాశం మాత్రం ఉంటుంది.

గర్భం మధ్యలో కొద్దిపాటి బ్లీడింగ్ కనిపించే స్త్రీలలో 50% మందికి ఎబార్షన్ అవదు.

తరచు ఈ అబార్షన్ రిస్కు 12 వారాలలోపు (3వ నెలలోపు) అధికంగా ఉంటుంది.

ఈ టైంలో రమారమి 15-20% మందికి గర్భస్రావమై పోతుంది. ఈ కాలంలో యోనిద్వారం గుండా పొరలు కాని ముక్కలు కాని పడిపోతే తక్షణం డాక్టర్ని కలవాలి.

**◆ అబార్షన్‌ని నివారించవచ్చా?**

ఇది బ్లీడింగ్ కనబడగానే కలిగే మొదటి ఆలోచన. కాబోయే అబార్షన్‌కి సూచనగా బ్లీడింగ్ కనిపిస్తే - వెంటనే చర్య తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండొచ్చన్న ఆశకలగడం సహజంకదా!

అయితే చాలా అబార్షన్స్ (మిస్‌కేరేజెస్)ని ఆపలేము. ఆరోగ్యంగా లేని పిండాన్ని తొలగించడానికి శరీరం చేసే ప్రయత్నమే మిస్‌కేరేజ్. కనుక దాన్ని ఆపకపోవడమే మంచిది.

**◆ మెట్లు వేగంగా ఎక్కినా, కుదుపుల్లో పడినా, సెక్సులో పాల్గొన్నా అబార్షనవుతుందా?**

అదొక ఊహ ప్రచారంలో ఉంది. డాక్టర్లు కూడా జాగ్రత్తలు చెపుతారు. అయితే ఋజువులు మాత్రం లేవు. మిగతా వాటిమాట ఎలా ఉన్నా సెక్సువల్ల అబార్షన్ జరగదు.

**◆ దారితప్పిన గర్భం** - కొందరికి గర్భకోశంలో పెరగాల్సిన పిండం గొట్టంలో పెరగడం మొదలుపెడుతుంది. సన్నటి గొట్టంలో అదెన్నాళ్ళు పెరగగలదు? కనుక గొట్టం పగలడమూ, విపరీతమైన కడుపునొప్పి, బ్లీడింగ్, కళ్ళు తిరిగి పడిపోవడమూ లాంటివి సంభవిస్తాయి.

"మా కోడలు మరీ సుకుమారం! ఈ చదువుకున్న వాళ్ళంతా యింతే. కొంచెం కూడా ఓర్చుకోలేరు. తిండి తినమంటే తినదు. ఏం తిన్నా యిమడదు. ఇదుగో ఇలా పడిపోయి




కడుపు పోగొట్టుకుంది" అని ఓ అత్తగారు నానా రభసా చేసింది. (తర్వాత డాక్టరు చేత తిట్లు తిందనుకోండి!).

అలాంటి పొరపాటు నిర్ణయాలకు రాకుండా కడుపులోనొప్పి, రక్తస్రావం కలిగిన గర్భవతిని క్షణాలమీద డాక్టరుకి చూపించాలి.

◆ **ముత్యాల గర్భం** : గర్భం గర్భమని మురిసిపోతే నారింజ తొనలో ముత్యాల్లాంటి ముద్దతో గర్భం వస్తుంది కొందరికి. అప్పుడు కూడా అర్థాంతరపు బ్లీడింగ్ కనిపిస్తుంది. సరైన వైద్య సంరక్షణ జరక్కపోతే ఇది కేన్సరుకి దారితీయవచ్చు. కాబట్టి గర్భిణికి బ్లీడింగ్ కనిపిస్తే - అది ఏ కారణం వల్ల కలిగిందో మనకి తెలీదు కనుక - డాక్టరుకి చూపించాల్సిందే.

ఒకవేళ ఇంటిదగ్గరే గర్భస్రావమై - అది ముత్యాల గర్భిణీ అని తేలితే కూడా వెంటనే డాక్టర్ని కలవాలి.

◆ కొందరికి గర్భం ఆఖరు నెలల్లో బ్లీడింగ్ కనపిస్తుంది. 7వ నెలనుంచి 9వ నెల వరకు. దీనికీ తొలి 3 నెలల్లో కనిపించే బ్లీడింగ్‌కి గల కారణాల్లో చాలా తేడా ఉంది.

ఈ సమయంలో కనిపించే బ్లీడింగ్‌కి ఓ ప్రధాన కారణం గర్భాశయ కంఠం ఒరుసుకుని ఎర్రబడటం లేదా దానిపై ఏర్పడే పెరుగదలలూను.

అలాగే కొందరికి - అంటే సుమారు నూరింట ఒకరికి - నొప్పులు రావడానికి బాగాముందే కాని నొప్పుల సమయంలో కాని మావి గర్భసంచి నుంచి ముందుగా వేరుపడిపోతుంది. (Placental abruption). దీనివల్ల తరచు కడుపునొప్పి, బ్లీడింగు కలుగుతాయి.

◆ మావి గర్భాశయంలో అడుగుభాగాన ఉన్నప్పుడు అది గర్భాశయం మూతిని



పూర్తిగాకాని, కొంతమేరకు కాని మూసేస్తుంది. దీన్ని ప్లాసెంటా ప్రీవియా అంటాం. అందువల్ల బ్లీడింగ్ అవుతుంది. ఇది సీరియస్ పరిస్థితి. తక్షణ వైద్య సహాయం అవసరం.

◆ నెలలు నిండేక బ్లీడింగ్ కనిపిస్తే ప్రసవ సమయం వచ్చిందని అర్థం. ఈ బ్లీడింగ్‌కి ముందు కొద్దిగా తెల్లటిముద్ద కూడా పడుతుంది.

ఏదిఏమైనా గర్భిణీకి ఏ దశలో బ్లీడింగ్ కనిపించినా డాక్టర్ని సంప్రదించడం ముఖ్యమన్నది మరవకూడదు. పైన యిచ్చిన సమాచారం అంతా అవగాహన కోసం మాత్రమే.

## అతనితో అతనికే పెళ్ళి!



మగవాళ్ళు-మగవాళ్ళు కాపురాలు చేయడం వింటున్నాం. ఆడవాళ్ళు-ఆడవాళ్ళు కలిసి కాపురాలు చేయడమూ వింటున్నాం. పెళ్ళిళ్ళు చేసుకోవడమూ వింటున్నాం!

కాని ఒకతను తనని తానే పెళ్ళి చేసుకోవడం విన్నారా? అదే జరిగింది న్యూయార్క్‌లో! 125 మంది అతిథుల సమక్షంలో "కెవిన్ నాడల్ అనే నేను కెవిన్ నాడల్‌ని పెళ్ళిచేసుకుంటున్నాను" అని ప్రమాణం చేస్తూ పెళ్ళి చేసుకున్నాడు. ఇతనికేమన్నా పిచ్చా ఏంటి అనుకోమాకండి. ఈ ఫిలిప్పినో-అమెరికన్ స్వజాతిసంపర్కీయుడు. ఆషామాషీ మనిషి కాడు, కౌన్సిలింగ్ సైకాలజీలో పట్టభద్రుడే కాడు *Ph.D* కూడా.

ఇంతకీ తనని తానే పెళ్ళి చేసుకుని ఇతగాడు ఏం చేయదల్చుకున్నాట్ట? అంటే - "మనమంతా వందలాది పెళ్ళిళ్ళకి వెళ్ళి అభినందించి, విందులారగించి వస్తున్నాం. ప్రతిసారీ ఇద్దరు వ్యక్తులు ఏకమవడాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. ఏం? దంపతులవటమేనా సెలబ్రేట్ చేయదగ్గ అంశం?? బ్రహ్మచారి జీవితాన్ని సెలబ్రేట్ చేయకూడదా??? దంపతులుగా మారిన స్త్రీ పురుషుల్ని అందరూ అభినందిస్తారు. తమలో కలుపుకుంటారు. ఒంటరిగా (పెళ్ళి చేసుకోకుండా) ఉండిపోయిన వాళ్ళని - ముఖ్యంగా స్త్రీలని - ఎందుకో భిన్నంగా చూస్తారు. 'వీళ్ళు బ్రహ్మచారులుగా ఉండిపోయారు' అనరు "పాపం పెళ్ళికాలేదు" అంటారు, అదేమిటో?!

"అందుకే నేనీ పని చేశా! సింగిల్ లైఫ్ కూడా సెలబ్రేట్ చేయదగ్గదే నని చాటడమే నా ఉద్దేశ్యం" అంటున్నాడు కెవిన్ మహాశయుడు. నిజమే కదూ?!